



లైంగిక దాడులు అరికట్టాలని కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ప్రజాసంఘాలు

భద్రతపై పోలీస్ బాస్‌కు సవాళ్లు

-బాలికలు, మహిళలపై పెరుగుతున్న నేరాలు
-దళితులపై దాడులు, హత్యలు
-పెరుగుతున్న దొంగల బెడద-జాడలేని ఎల్‌హెచ్ఎంఎస్
-పని చేయని నిఘానేత్రాలు-విచ్చలవిడిగా ఆన్‌లైన్ మోసాలు
-నూతన ఎస్‌పి రాకతో నేరాలు తగ్గేనా

ప్రజాశక్తి - కర్నూలు క్రైం

పెరుగుతున్న సాంకేతికతతో పాటు నేరాలు కూడా విస్తరిస్తూనే ఉన్నాయి. నేరాలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. పోలీసులు ఎప్పటికప్పుడు నివారణకోసం చర్యలు తీసుకుంటున్నా ఏదో రూపంలో ప్రత్యక్షమవుతూనే వారికి సవాళ్లుగా మారుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా ఇదివరకు మహిళలపై నేరాలు, పిల్లలపై అఘాయిత్యాలు, దళితులపై దాడులూ, హత్యలు నేటికీ కొనసాగుతూనే ఉన్నాయి. దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ ప్రజలకు చుక్కలు చూపుతున్నారు. నివారించేందుకు ఏర్పాటు చేసిన లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం జాడే కనిపించడం లేదు. నేరపరిశోధనకు ఉపకరించే సిసి కెమెరాలు నగరంలో పనిచేయడం లేదు. ఈ నేపథ్యంలో జిల్లాకు విచ్చేసిన పోలీస్ కొత్త బాస్ గరికపాటి బిందు మాధవ్‌కు ఇవన్నీ పెనుసవాళ్లుగా మారనున్నాయి. ఆయన రాకతో శాంతి భద్రతలపై ప్రజలు ఆశలు పెంచుకున్నారు.

ఇంటి నిఘా ఏమైందో...

ఇళ్లలో దొంగతనాలు నియంత్రించడానికి టిడిపి అధికారంలో ఉన్న సమయంలో లాక్‌డ్‌హౌస్ మానిటరింగ్ సిస్టం (ఎల్‌హెచ్ఎంఎస్)ను పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రవేశపెట్టింది. దీనికోసం అప్పట్లో ఇంటింటి సర్వే నిర్వహించి ఇంటి అడ్రస్, అందులో నివసించే కుంటుంబాల వివరాల డేటాను ప్రత్యేక యాప్‌లో రిజిస్టర్ చేసింది. ఎవరైనా ఇంటికి తాళం వేసి వేరే ఊర్లకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఆ ఇల్లు ఏ స్టేషన్ పరిధిలోకి వస్తుందో ఆస్టేషన్‌లో ముందుగానే సమాచారమిచ్చి వెళ్లాల్సి ఉంటుంది. ఈనేపథ్యంలో సదరు స్టేషన్ సిబ్బంది ఆ ఇంటిపై ప్రత్యేక కెమెరాను ఇంట్లో ఏర్పాటు చేసి గస్తీ నిర్వహిస్తారు. రక్షణ కల్పిస్తారు. కానీ ప్రస్తుతం ఈ ఎల్‌హెచ్ఎంఎస్ జాడే లేకుండా పోయింది. ఇది ఉందో లేదో కూడా ప్రజలకు తెలియడం లేదు. ఉంటే దీనిపై ప్రజలకు అవగాహన కల్పించి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కొత్తపేటకు చెందిన ఓ కుంటుంబం బంధువుల పెళ్లికెళ్లి వచ్చిచూడగా దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంటిలోని డబ్బు, నగలు దొంగిలించారు.

కళ్లుమూసి తెరిచేలోగా ఖాతా ఖాళీ

జిల్లాలో భారీ ఎత్తున ఆన్‌లైన్ మోసాలు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో మోసగాళ్ల జనాలకు డబ్బు, అమ్మాయిలు, గిప్టుల పేరుతో ఆశజూపి బుట్టలో వేసుకుంటున్నారు. దీనికి ఆకర్షితులైన వారు నమ్మి వారి అకౌంట్ వివరాలను, ఓటిపిలను, పాస్‌వర్డులను అవతలి వారికి షేర్ చేస్తున్నారు. ఆపై కళ్లుమూసి తెరిచే లోపే, వారి అకౌంట్లలో ఉన్నడబ్బుమొత్తం ఖాళీ అవుతోంది. ఇలాంటి ఆన్‌లైన్ మోసగాళ్ల వలకు ఏకంగా డిపార్టుమెంటులో పనిచేసే ఓ సిఐకూడా చిక్కుకుని సుమారు రూ.2.50 లక్షలపైగా కోల్పోయిన విషయం తెలిసిందే. కర్నూలు మాజీ ఎంపీ సంజీవ్ కుమార్ కూడా వారి బుట్టలో పడ్డారు. ఇటీవల మద్దూరు నగర్‌కు చెందిన ఓ సామాన్య కారుడ్రైవరు తన కుటుంబ అవసరాలు, కూతురు ఫీజు చెల్లించుకునేందుకు అప్పుగా తెచ్చుకున్న రూ.70 వేలు ఆన్‌లైన్‌లో మోసపోయాడు. ఇలా చేతులు కాల్చుకుని పరువు పోతుందని బయటకు రాని కేసులు మరెన్నో...

దళితులు, మహిళలపై ఆగని దాడులు



జిల్లాలో బాలికలు, మహిళలపై నేరాలు రోజురోజుకు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. మహిళలు వారికి జరుగుతున్న అవమానాలను చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల ధైర్యం చేసి పోలీసు స్టేషన్ మెట్లెక్కినా స్టేషన్ అధికారులు నచ్చజెప్పి కేసు నమోదు చేయకుండా అటు నుంచి అటే పంపించేస్తున్నట్లు వినికిడి. ఇదిలా ఉంటే బాలికల పట్ల కూడా నేరాలు అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. ఈమధ్య కాలంలోనే బాలికను రేపు చేసిన కేసులో జిల్లా ఫాస్ట్ ట్రాక్ కోర్టు పోక్సో కేసులో నిందితునికి యావజ్జీవ కారాగార శిక్షను విధించిన సంగతి తెలిసిందే. రెండు నెలల క్రితం కర్నూలు నగర సమీపంలోని గార్గేయపురం చెరువులో ఇద్దరు మహిళలు శవంగా తేలి కనిపించారు. ఇటీవలే ఆదోని మండలంలో భూ వివాదంలో తమకు అడ్డువస్తోందని పెత్తందార్లు దళిత మహిళ గుండమ్మను దారుణంగా ట్రాక్టరుతో తొక్కించి చంపివేశారు. వెల్దుర్తి మండలం రత్నపల్లె గ్రామంలో జూన్ 16న రాత్రి కందిపంట నాశనం చేసి దౌర్జన్యంగా పెత్తందార్లు విత్తుతుంటే అడ్డువస్తుందని దళిత మహిళ గురిగింజ హనుమక్కను వృద్ధురాలు అని చూడకుండా ఆమెను, వారి కుటుంబ సభ్యులపై దాడి చేశారు. ఆదోని మండలం పట్టణ కేంద్ర వసంతనగర్‌లో మొహర్రం సందర్భంగా డప్పు కొట్టేందుకు వెళ్లిన లక్ష్మన్న అనే దళిత యువకునిపై అక్కడి పెత్తందారులు దాడిచేశారు. ఎమ్మిగనూరు మండలం కోటేకల్లులో మొహర్రం సందర్భంగా అందరితో పాటు అలాయి గుంత వద్ద సావ్‌సోని ఆడరాదని అడ్డుకుంటున్నారు. జిల్లా కేంద్రంలోని ఓ దళిత ఒంటరి మహిళలపై స్టాఫ్‌నర్సుగా పనిచేసే జయరాం అనే ఓ వ్యక్తి ప్రేమపేరుతో వంచించి పెళ్లి చేసుకుని, ఆమెను శారీరకంగా, ఆర్థికంగా వినియోగించుకుని తర్వాత తనకు ఇష్టం లేదంటూ వదిలేశాడు. ఇదే విషయంపై ఆ కర్నూలు మహిళ పోలీసు స్టేషన్, నాల్గో పట్టణ పోలీసులను ఆశ్రయిస్తే ఈ కేసు తమ పరిధిలోకి రాదని ఒకరిపై ఒకరు చెప్పి కేసు నమోదు చేయకుండా బాధితురాలును వెనక్కి పంపినట్లు సమాచారం.



దళిత గుండమ్మ ఫైల్ ఫొటో

నిఘానేత్రాలు నిద్రపోతున్నాయ్...

పోలీసులు నేరాలను అరికట్టే భద్రతా చర్యల్లో భాగంగా నగరంలోని పలు ప్రధాన కూడళ్లలో నేరాలకు ఆస్కారం ఉండే ప్రాంతాల్లో వందల సంఖ్యలో సిసి కెమెరాలను అమర్చారు. ఏదైనా నేరం చోటు చేసుకున్నప్పుడు నిందితులను పట్టించే విషయంలో వీటి పాత్ర అత్యంత కీలకంగా ఉంటోంది. చాలా సందర్భాల్లో వీటి ఆధారంగానే అనేక మిస్టరీ కేసుల్లోనూ ఇవి ఎంతో ఉపకరించిన పరిస్థితులు ఉన్నాయి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన సిసి కెమెరాలు చాలా కాలంగా నిద్రలోకి జారుకున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో ఇటీవల కర్నూలు నగరంలో చాలా కేసుల్లో పోలీసు అధికారులు నేర పరిశోధనకు వెళ్లినప్పుడు సిసి కెమెరాల పుటేజీలను పరిశీలించేందుకు వెళ్లితు పనిచేయడం లేదు.





సమస్యలపై దృష్టి సారిస్తా : ఎస్‌పి

జిల్లాకు నూతనంగా బాధ్యతలను స్వీకరించిన ఎస్‌పి జి.బిందుమాధవ్ జిల్లాలో నెలకొన్న శాంతి, భద్రత సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారిస్తారన్న విశ్వాసాన్ని జిల్లా ప్రజలు పెద్దఎత్తున పెట్టుకున్నారు. ఈనేపథ్యంలో ఆయన జిల్లాలో ఒక్కటిగా సమస్యలను అధ్యయనం చేస్తూ ముందుకు వెళతానని అన్నారు. ముఖ్యంగా జిల్లాలో మహిళలు, దళితులు, మైనార్టీలు సమస్యలపై ప్రత్యేక దృష్టిని సారిస్తానని,సమస్యాత్మక ప్రాంతాలపై, సంఘ విద్రోహక శక్తులను అరికట్టడానికి ప్రత్యేక చొరవ చూపుతానని అన్నారు.

లైంగిక దాడులు అరికట్టాలి

కలెక్టరేట్ ఎదుట ప్రజా సంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

చిన్నారులు మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులను అరికట్టాలని ప్రజా సంఘాలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. మంగళవారం కలెక్టరేట్ ఎదుట చిన్నారులు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తు ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఆర్‌విఎస్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి సాయిఉదయ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఐద్వా జిల్లా అధ్యక్షులు కె.అరుణ, ఆర్‌విఎస్ నాయకురాలు జయమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప్ప, డివైఎఫ్ఐ నగర కార్యదర్శి హుస్సేన్ బాష , కెవిపిఎస్ జిల్లా నాయకులు కృష్ణ, ఆర్‌విఎస్ నగర కార్యదర్శులు శేషాద్రి ,శ్రీనివాసులు మాట్లాడారు. చిన్నారులపై, మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఈ దాడులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాన్నారు. దేశంలో, రాష్ట్రంలో కఠినమైన నిర్భయ, దిశ చట్టాలు అమలులో ఉన్నా వాటిని ఆచరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ దాడులు పెద్ద ఎత్తున మహిళలపై జరుగుతున్నాయని విమర్శించారు. నంద్యాల విజయనగరం ,గుంటూరు జిల్లాల్లో చిన్నారులపై జరిగిన లైంగిక దాడులకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ముచ్చుమర్రిలో చిన్నారి వాసంతి మృతదేహం నేటికీ కూడా లభ్యం కాకపోవడం చాలా బాధాకరమన్నారు. దేశంలో రోజురోజుకి లైంగికదాడులు పెరుగుతున్నా ప్రభుత్వాలు దుండగులపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ దాడులు దౌర్జన్యాలు జరగడానికి ముఖ్య కారణం మద్యం, డ్రగ్స్ కారణమని, మద్యం మత్తులో మహిళలపై చిన్నారులపై లైంగికంగా దాడులు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలన్నారు. పార్లమెంటులో, అసెంబ్లీలో మహిళలకు గౌరవం ఇస్తున్నామని చెప్పడమే తప్ప ప్రత్యక్షంగా ఎటువంటి గౌరవం మహిళలకు లభించడం లేదన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలంటే ప్రభుత్వాలు తక్షణమే మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. డ్రగ్స్, మద్యాన్ని నివారించి మహిళలకు రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై దాడులకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్న వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర నాయకురాలు పద్మ ,సుజాత , శ్యామల, ఎస్ఎఫ్ఐ నాయకులు అమర్, ఆర్యన్ ,అబ్బు,యోగి, ఖాజా, ఆదిత్య, హేమంత్, కళ్యాణ్, డివైఎఫ్ఐ నాయకులు గౌతం, మహేష్, భరత్, రజక సంఘం నాయకులు ఎల్లయ్య, చందు, రాముడు, పుష్ప కెవిపిఎస్ నాయకులు గోపాల్ ,రైతు సంఘం నాయకులు దస్తగిరి పాల్గొన్నారు.

అవినీతికి అడ్డే లేదు

ఎంఇఓ కార్యాలయంలో డబ్బులేనిదు పనికాదు-కట్టడి చేయలేని ఉన్నతాధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా కేంద్రంలోని మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఏదైనా పని చేయాలంటే లంచం ఇస్తే తప్ప ఫైలు ముందుకు సాగదు. సదరు ఎంఇఓ కార్యాలయంలో మండల విద్యాశాఖ అధికారికి ఉపాధ్యాయుల హెల్త్ క్లెయిమ్ బిల్లులు చేస్తే దాంట్లో 10 శాతం వాటా చెల్లించాల్సిందే. ఇది జిల్లా వ్యాప్తంగా ఎంఇఓల కార్యాలయంలో జరుగుతున్న అవినీతి తంతు. ప్రస్తుతానికి ప్రతి మండలానికి ఇద్దరు ఎంఇఓలను నియమించారు. గతంలో మండల విద్యాశాఖ అధికారులకు పనిభారం ఎక్కువ కావడంతో ఇద్దరిని నియమించడంతో పని విభజన కూడా చేశారు. ఇక్కడ జరుగుతున్న అవినీతి కార్యకలాపాలను అదుపు చేయడంలో ఉన్నతాధికారులు వైఫల్యం చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఎంఇఓ కార్యాలయాల్లో అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఈ కార్యాలయానికి ఏ ఫైలు వచ్చినా తప్పనిసరిగా లంచం ఇస్తే తప్ప వాటిని ఆమోదం ముద్ర వేయరు. ఉపాధ్యాయుల వేతనాలకు సంబంధించిన బిల్లులు పెడితే కూడా వాటిని ఆమోదానికి తప్పనిసరిగా కొంత మొత్తం చెల్లించుకోవాల్సిందే. కర్నూలు నగరంలోని ఎంఇఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతికి అదుపు లేకుండా పోతుంది. ఎక్కువగా పనిచేసే ఉపాధ్యాయులు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు ఉంటారు. అలాంటివారు తమ హెల్త్‌కు సంబంధించిన బిల్లులు క్లెయిమ్ చేసుకునేందుకు బిల్లులను సదరు కార్యాలయం పంపిస్తే ఉదాహరణకు రూ రెండు లక్షలు క్లెయిమ్ చేసుకోవాలనుకుంటే అందులో పది శాతం చెల్లిస్తేనే ఇక్కడి నుండి బిల్లును ఆమోదముద్ర వేసి జిల్లా కార్యాలయానికి పంపుతారు. లేని పక్షంలో బిల్లులను పక్కన పాడేస్తారు. ఏదైనా పాఠశాలలో పరిశీలనకు వెళ్తే సదరు అధికారికి రవాణా ఖర్చులు తోపాటు కొంత నగదు కూడా ఇవ్వాలి. ప్రైవేటు పాఠశాలలకు తనిఖీలకు వెళ్తే అక్కడ కూడా ఎంతో కొంత ముట్ట చెప్పాల్సిందే. విద్యా కానుక కిట్లను మండల రిసోర్స్ కేంద్రం నుండి సదరు పాఠశాలకు చేర్చేందుకు అవసరమయ్యే రవాణా చార్జీలను సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఇస్తున్నారు. ఎంఇఓలు మాత్రం ఎక్కడా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు రవాణా చార్జీలను చెల్లించకుండా వారే డ్రా చేసుకుని వినియోగించుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మండల విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పాఠశాలల్లో పరిశీలన చేసి నాణ్యమైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో నామమాత్రంగా తనిఖీలు చేపట్టడంతో పూర్తిస్థాయిలో విద్యాశాఖ ఉన్నతాధికారులు పట్టు సాధించలేకపోతున్నారు. అవినీతిని అదుపు చేయలేక పోతున్నారు.

మంత్రిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్



కర్నూలు జిల్లా ఎస్‌పిగా జి. బిందు మాధవ్ బాధ్యతలు స్వీకరించిన సంధర్భంగా ఆయన మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహార ప్రక్రియల శాఖ మంత్రి టిజి. భరత్‌ను సంకల్ బాగ్‌లోని మంత్రి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అభివృద్ధి అంశాలపై, శాంతిభద్రతల పరిరక్షణ కు తీసుకోవలసిన పలు అంశాల పై ఇరువురు చర్చించారు.



డిఎఫ్‌సిఎస్ చైర్మన్ గా బిఎస్ నవీన్ కుమార్

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్ష స్థానానికి ఈ నెల 16న కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎన్నికల అధికారి డి.పామన్న మత్స్యశాఖ ఐఎఫ్‌టిసి కార్యాలయంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికలలో బిఎస్ నవీన్ కుమార్ జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. డిఎఫ్‌సిఎస్ చైర్మన్ బిఎస్. నవీన్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు నిర్వహించిన అధికారికి , మత్స్యశాఖ అధికారులకు ఎన్నికలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భద్రత కల్పించి పర్యవేక్షించిన టూ టౌన్ పోలీస్‌లకు, మత్స్య సహకార సంఘం ఉపాధ్యక్షుడు పెద్ద వీరేష్, డైరెక్టర్లు భాస్కర్, మల్లీశ్వరుడు, నాగశేషులు, పోతుల శేఖర్, వెంకటేశ్వర్లు, నగేష్, మద్దిలేటి ఇందుకు సహకరించిన మత్స్య సహకార సంఘం అధ్యక్షులు గూడూరు శ్రీనివాసులుకు హృదయపూర్వక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు. కర్నూలు మత్స్యశాఖ ఉపసంచాలకులు శ్యామలమ్మ , ఎఫ్‌డిఓ స్వర్ణలత , పామన్న , బాలరాజు , మత్స్యశాఖ సిబ్బందికి నవీన్ కుమార్ ధన్య వాదాలు తెలిపారు.

జిల్లా ప్రజలకు మొహర్రం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా ప్రజలకు, కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు, కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరపున డిసిసి అధ్యక్షులు కె.బాబు రావు మొహర్రం , తొలి ఏకాదశి శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామాలలో మొహర్రం వేడుకలను హిందూ, ముస్లింలు కలిసి ఐకమత్యంతో జరుపుకోవాలని ఆయన కోరారు.

మట్టిరోడ్లు కూడా లేవు

నగరపాలక సంస్థ పన్ను మాత్రం వసూలు చేస్తుంది : పిపిఎస్ఎస్ విమర్శ

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పన్నులు చెల్లించే ప్రజల ఇండ్ల ముందు నడిచేందుకు ఎర్ర మట్టి రోడ్డు వేయాలనే స్పృహ లేని నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు. ఎనిమిది అడుగుల విస్తీర్ణం గల 70 ఏళ్ల క్రితం నాటి మురుగు కాల్వను కబ్జా చేసినా టౌన్ ప్లానింగ్ సెక్షన్ , రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారుల,ప్రజా ప్రతిదుల మెప్పు పొందే పనులు తప్ప సాధారణ ప్రజల సమస్యలపై మున్సిపల్ ఇంజనీర్లు స్పందించడం లేదు. ఏళ్ల తరబడి ఇంటి పన్నులు చెల్లిస్తున్న ప్రజలకు నడిచేందుకు వారి ఇళ్ళ ముందు కనీసం ఎర్ర మట్టి రోడ్డయినా వెయ్యాలనే స్పృహ కూడా నగరపాలక సంస్థ అధికారులకు లేకుండా పోయిందని పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు సుధాకర్ బాబు, రాఘవేంద్ర విమర్శించారు. వర్షాకాలం ప్రారంభమైనందున గత రెండు రోజులుగా నగరంలోని పలు కాలనీలలో సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బళ్ళారి చౌరస్తా సమీపంలోని డిమార్ట్ వెనక కాలనీలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచి రోడ్లన్నీ బురదమయమై అడుగుదీసి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. ప్రతిరోజు వృద్ధులు పిల్లలు ఇండ్ల నుండి రోడ్డుపైకి అడుగు పెట్టాలంటే భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు అనేకసార్లు అర్జీలు ఇచ్చినా పట్టించుకోవడంలేదన్నారు. 70 ఏళ్ల క్రితం నాటి సుమారు 8 అడుగుల విస్తీర్ణం గల మురుకి కాలువను బడా బాబులు కబ్జా చేసినా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు, ప్రజాప్రతితులు స్పందించలేదన్నారు. ఉన్నతాధికారుల, ప్రజా ప్రతినిధుల మెప్పు పొందే పనులు చేయడానికి కొందరు కింది స్థాయి అధికారులు అలవాటు పడ్డారని విమర్శించారు. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మురుగు కాలువను కబ్జా చేసిన వారిపై చర్య తీసుకోవాలన్నారు. పన్నులు చెల్లించే ప్రజల ఇళ్ళ ముందు నడిచేందుకు వెంటనే ఎర్ర మట్టి రోడ్లయినా వేయాలని కోరారు. ఈ పర్యటనలో సంఘం సీనియర్ నాయకులు గోవిందు, స్థానిక మహిళలు లక్ష్మమ్మ, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.



డీమార్టు వెనుకాల రోడ్డు లేని కాలనీని పరిశీలిస్తున్న పిపిఎస్ఎస్ నాయకులు

డ్రైయినేజీ కాలువలు నిర్మించి, సిమెంట్ రోడ్లు వేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : కర్నూలు నగరంలోని 24వ వార్డు లక్ష్మీ నగర్ లోని లాస్ట్ లైన్‌లో డ్రైనేజీ కాలువ నిర్మించి సిమెంట్ రోడ్డు వేయాలని కోరుతూ సిపిఎం 23వ వార్డు కమిటీ ఆధ్వర్యంలో సంతకాలు చేయించిన వినతి పత్రాన్ని మున్సిపల్ కమిషనర్ ఎ. భార్గవతేజ ఇచ్చారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్. నరసింహులు సిపిఎం 23వ వార్డు కార్యదర్శి కెవి. జనార్ధన్‌రావు మున్సిపల్ కమిషనర్ కు సమస్యను వివరిస్తూ లక్ష్మీ నగర్ లాస్ట్ లైన్ లో డ్రైనేజీ కాలువ లేకపోవడం వలన వర్షం పడిన ప్రతిసారి కూడా శుద్ధ వాగు పొంగిపొర్లి మురుగు నీరంతా రోడ్డుపైన మోకాళ్ళ లోతు నీరు నిలబడుతుందని తెలిపారు. ఈ వర్షపు నీరు మురుగునీరు ఎక్కడ పోవడానికి దారి లేకపోవడం కారణంగా రోడ్డుపైనే 15 రోజుల వరకు మురుగునీరు నిలిచిపోతున్నదని, ప్రజలకు రాకపోకలకు చాలా ఇబ్బందిగా మారి ఇళ్లలో నుంచి ప్రజలు బయటికి రావడానికి చాలా అవస్థలు పడుతున్నారన్నారు. పిల్లలు, వృద్ధులు ఈ నీటిలో నడవలేక జారిపడి ప్రమాదాలకు గురవుతున్నారు. మురుగునీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండడం కారణంగా దోమలు, పందులకు నిలయంగా మారి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి విషజ్వరాలు ప్రబలుతున్నాయి. దీనికారణంగాప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. గతంలో డ్రెయినేజీ కాలువ రోడ్డు శాంక్షన్ అయ్యిందని పని మొదలు పెట్టడానికి మెటీరియల్ కూడా తోలారని, కానీ ఎన్నికల కోడ్ వచ్చిందని పనులు ఆపేశారన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు పనులు చేయలేదు. వర్షాకాలం అయినందున ప్రజలు చాలా ఇబ్బంది పడే పరిస్థిలుతున్నాయని తెలిపారు. త్వరగా పనులు ప్రారంభించి డ్రెయినేజీకాలువను, రోడ్డునువేయాలని కమిషనర్‌కు తెలపగా కమిషనర్ స్పందించి మాట్లాడుతూ త్వరలోనే డ్రెయినేజీ కాలువరోడ్డు పనులుప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు ఎస్. అజ్మత్, పెద్ద సూరిబాబు పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నరసింహులు, తదితరులు

సమస్యాత్మక మండలాలపై ప్రత్యేక నిఘా

పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి


ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మొహర్రం పండుగ సందర్భంగా ఆస్పరి ,దేవనకొండ, వెల్దుర్తి ,కృష్ణగిరి మండలాలను సమస్యాత్మకంగా గుర్తించామని పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పత్తికొండ డిఎస్‌పి కార్యాలయంలో ప్రజాశక్తితో పత్తికొండ డిఎస్‌పి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమస్యాత్మక మండలాల్లో గ్రామీణ ప్రాంతాలలో పీర్ల స్వాములకు ప్రత్యేక పూజలు చేసుకొని , పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఇప్పటికే పీర్లస్వామి గుడి దగ్గర ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి, గట్టి పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మొహర్రంలో ఎవరైనా గొడవలు సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలం, గ్రామీణప్రాంతాలలో ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడి నట్లు తెలిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

నన్నూరులో అన్నదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ :



నన్నూరు గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన పీర్ల సావిడి వద్ద అన్నదాన కార్య క్రమాన్ని మంగళ వారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా టిడిపి నాయకులు బుజ్జప్ప నిర్వాహకులు షాపూరి హరి అప్ప, శెట్టి రవీంద్ర ప్రసాద్ అన్నదానం అనంతరం పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ కోఆప్షన్ మెంబర్ శంషుద్దీన్, మైనార్టీ నాయకులు హుస్సేన్ ,సర్కార్ జాకీర్ హుస్సేన్, మహమ్మద్ షఫీ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.



డయేరియాపై అప్రమత్తం చేయండి : ఎంపిడిఓ

ప్రజాశక్తి- సి బెళగల్

డయేరియా పై గ్రామాల్లో అప్రమత్తం చేయాలని ఎంపిడిఓశకుంతల ఆయా పంచాయతీల అధికారులకు సూచించారు. మంగళవారం పరిషత్ కార్యాలయంలో ఇఓఆర్‌డి సందీప్ సమక్షంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం కనుక భూమిలో కొత్త నీరు చేరడం ఆ నీటిని మనం తాగడంతో సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయని, కాచి వడ బోసిన నీటినే తాగాలని ఈ సందర్భంగా ప్రజలతో అన్నారు. డయేరియా పై అవగాహన మరింత విస్తృతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎండిపోయిన కుప్పగల్లు ఎస్‌ఎస్ ట్యాంకు

- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తాగునీరు అందించాలి : సిపిఎం

పజాశక్తి-ఆదోనిరూరల్

మండలం పరిధిలో కుప్పగల్ ఫారెస్ట్ సమీపంలో నిర్మించిన కుప్పగల్ ఎస్ఎస్ ట్యాంకు 7 గ్రామాలకు తాగునీరు అందించాలని ఉద్దేశంతో నిర్మించారని, ఈ ఎస్ఎస్ ట్యాంక్ ఎండిపోయి దాదాపు పది రోజులు అవుతున్నా అధికారులు, కాంట్రాక్టర్ పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని సిపిఎం ప్రతినిధి బృందం విమర్శించింది. మంగళవారం సిపిఎం మండల కార్యదర్శి కే.లింగన్న, మండల నాయకులు రామాంజనేయులు ఆధ్వర్యంలో పాండవగల్లు, కుప్పగల్లు,బలేకల్లు, గ్రామాలకు చెందిన సిపిఎం ప్రతినిధి బృందం కుప్పగల్లు ఎస్ఎస్ ట్యాంకును పరిశీలన చేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎస్ఎస్ ట్యాంక్ లో నీళ్లు నిలువ ఉన్నప్పుడే వారానికి ఒకసారి నీళ్లు అందే పరిస్థితి లేదని, ఎస్ఎస్ ట్యాంక్ ఎండిపోవడంతో గత పది రోజులుగా తాగునీళ్ళు లేక, పెద్దతుంబలం, కుప్పగల్లు, బల్లెకల్లు, పాండవగల్లు, జాలమంచి, గనేకల్లు, ఇస్వి గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఎస్ఎస్ ట్యాంకు ఎండిపోయి దాదాపు పది రోజులు అవుతున్న అధికారులకు కనీసమైన చలనం కూడా లేకుండా గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా ఉన్నారని వారు విమర్శించారు.



ఎస్ఎస్ ట్యాంకు ను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఇప్పటికైనా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే చొరవ తీసుకొని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ట్యాంకర్ల ద్వారా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే టీబీ డ్యాం అధికారులతో, కలెక్టర్‌తో ఎమ్మెల్యే మాట్లాడి తక్షణమే ఎల్ఎల్సికి నీళ్లు వదిలే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ విధంగా అయితేనే ప్రజలందరికీ తాగునీరు అందే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రజలకు త్రాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లేని పక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున రోడ్ల పైన, కార్యాలయల ముందు ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు కృష్ణ, వై.ఉసేని, పాండురంగ, సిపిఎం పాండవగల్లు, కుప్పగల్లు శాఖ కార్యదర్శులు కే.గోవిందు, కే.వెంకటేష్, సిపిఎం సభ్యులు కృష్ణ, ఉరుకుంద, నర్సిరెడ్డి, హనుమంత్ రెడ్డి, కొండయ్య, వీరేష, తిమ్మప్ప పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లు

- ప్రభుత్వ ఆదాయానికి గండి - పట్టణ, గ్రామీణ ప్రాంతాల తేడా లేకుండా భారీగా లేఅవుట్లు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నిబంధనలు తుంగలో తొక్కి పట్టణ, గ్రామీణ ప్రాంతాలనే తేడా లేకుండా లే అవుట్లు వేసేస్తున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీ అవసరాలకు స్థలం ఇవ్వాల్సి ఉండగా అది వదలరు. మరో వైపు ల్యాండ్ కన్వర్షన్ జరగవు. మున్సిపాలిటీ, పంచాయతీ, కూడా అనుమతులు తీసుకోరు. అయినా లేఅవుట్ వేయడంతో పాటు ప్లాట్లు వేసి దర్జాగా విక్రయాలు కొనసాగిస్తున్నారు. ఇందుకు రిజిస్ట్రేషన అధికారులు సహకరించడంతో ఆ రియల్టర్ల పని మరింత సులువుగా జరిగిపోతోంది. వాస్తవానికి ల్యాండ్ కన్వర్షన జరగకుండా లేఅవుట్ వేయకూడదు. అంతేకాకుండా మున్సిపాలిటీ, పంచాయతీకి స్థలం ఇవ్వకుండా రిజిస్ట్రేషన చేయకూడదని నిబంధనలున్నాయి.దీనికితోడు కూడా అనుమతులు కూడా ఉండాలి. ఇవేవీ లేకుండానే లేఅవుట్ వేసేస్తున్నారు. దీన్ని బట్టి పంచాయతీ, మున్సిపాలిటీ అధికారులు ఎంత మొద్దు నిద్రలో ఉన్నారో తెలుస్తోంది.

ఆదోని మండలం పరిధిలో ఇస్వి, సాదాపురం, మండిగిరి, అరెకల్, పెద్ధహరిహణం, పెద్దతుంబలం, డణాపురం, తదితర గ్రామాలలో రియల్టర్లు లేఅవుట్ వేశారు. సాధారణంగా అయితే కుడా అనుమతులు ఉండాలి. అంతకంటే ముందు ల్యాండ్ కన్వర్షన చేయించాలి. పంచాయతీకి అవసరాలకు 60సెంట్లు స్థలం కేటాయించాలి. ఇవేవీ జరగకుండానే లేఅవుట్ వేశారు. విషయం కుడా, పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లకుండా అనాధకారికంగా కారికంగా ఎకరాలకు ఎకరాలు ప్లాట్లు వేసేస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో శిల్ప ఎస్టేట్, కావేరి ఎస్టేట్, ఎమ్మిగనూరు బైపాస్ పక్కన, ఆలూరు పత్తికొండ బైపాస్ పక్కన పట్టణ పరిధిలో మున్సిపాలిటీలకు తెలియకుండా ప్లాట్లు వేసిస్తున్నారు. ఇప్పటికే పట్టణం పరిధిలో ప్లాట్లు వేసిన దాంట్లో రిజిస్ట్రేషన్ అధికారులతో బేరం కుదుర్చుకుని రెండు రోజుల కిందట 1 8ప్లాట్లు కొనుగోలుదారులకు రిజిస్ట్రేషన చేయించినట్లు సమాచారం. అనధికార లేఅవుట్, ల్యాండ్ కన్వర్షన జరిగలేదా చూడాల్సిన రెవెన్యూ అధికారులు ఆవైపు తొంగిచూడలేదు. దీనికి తోడు వైసీపీ రియల్టర్లకు రిజిస్ట్రేషన శాఖ అధికారులు సహకరించడంతో ప్లాట్ల రిజిస్ట్రేషన్ చకచకా సాగిపోయింది. ఇందుకు సంబంధిత అధికారులకు పెద్ద మొత్తంలోనే ముట్టచెప్పారన్న వాదనలు ఆయా వర్గాల నుంచే వినిపిస్తున్నాయి.

వ్యవసాయ భూముల్లో లేఅవుట్ నిబంధనలు

వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చాలి. ల్యాండ్ కన్వర్షన్ కింద అధికారులకు దరఖాస్తు చేయాలి. ల్యాండ్ కన్వర్షన్ అనుమతులతో పంచాయతీ అప్రూవల్ ఉండాలి. 10 శాతం భూమిని



ఆదోని మండలం పరిధిలో లేఅవుట్లు వేసిన ప్లాట్లు

పంచాయతీకి అప్పగిస్తూ బడి, గుడి, క్రీడా ప్రాంగణాలకు స్థలం కేటాయించాలి. విశాలమైన వీధులు, డ్రైనేజీ నిర్మాణాలకు వీలుగా ఉండాలి. విద్యుత్ సౌకర్యం కోసం పంచాయతీ సెక్రటరీల అనుమతి తీసుకోవాలి. తర్వాత ప్లాట్లు వేసి అమ్మకాలు చేపట్టాలి.

అనుమతులు తీసుకోలేదు

- నాగరాజ్, ఇంచార్జ్ ఈవోపీఆర్డి.

గ్రామాలలో అక్కడక్కడ వేస్తున్న వెంచర్లకు పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. ఇప్పటి వరకు అనుమతులు తీసుకోలేదు. పంచాయతీకి కట్టాల్సిన రాయల్టీ కట్టలేదు. ప్లాట్లు కొన్న లబ్ధిదారులు గృహ నిర్మాణాలు చేపట్టే సమయంలో వారికి అనుమతులు ఇవ్వడం కుదరదు.

అక్రమ లేఅవుట్‌పై చర్యలు తీసుకోండి

- రాజు,గ్రామస్తుడు.

గ్రామాల్లో సమస్యలు ఉన్నాయి. ప్రజా సమస్యలు తీర్చేందుకు పంచాయతీలో డబ్బుల్లేవు. లేఅవుట్ వేసిన వారు పంచాయతీకి కట్టాల్సిన రాయల్టీ కట్టకుండా గండి కొట్టారు. అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలి.

అతిసారపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- జడ్‌పి సిఇఒ నాసరరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

అతిసార వ్యాధితో ఇరవై మంది అస్వస్థతకు గురి కావడంతో పాటు జ్యోతి (4)అనే చిన్నారి మృతి చెందడానికి గల కారణాలను సమగ్ర నివేదిక ద్వారా అందించాలని సిఇఓ నాసరరెడ్డి అధికారులను కోరారు. మంగళవారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామానికి నీటి సరఫరా అవుతున్న బోరును పరిశీలించి గ్రామీణ నీటి సరఫరా శాఖ డిఇ శ్రీనివాసుల రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా నుంచి గ్రామంలో అస్వస్థతకు గురైన వారికి సచివాలయంలో చికిత్స అందిస్తున్న డాక్టర్ వసంత కుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి కలుషితం వల్ల అతిసార బారిన పడుతున్నారని, ప్రస్తుతం ఆదోని ఏరియా ఆసుపత్రిలో 10 మంది చికిత్స పొందుతున్నారని ఇద్దరు డిశ్చార్జ్ అయ్యారని ఇప్పటి వరకు 25 మందికి చికిత్స చేసినట్లు ఆమె వివరించారు. తాగునీటి వల్లే అతిసార బారిన పడ్డారని ఆమె సిఇఓకు చెప్పగా కాదు అంటూ డిఇ శ్రీనివాసరెడ్డి నీటి పరీక్షల రికార్డు అందజేశారు. గ్రామంలో పారిశుధ్యంపై కార్యదర్శి చిరంజీవి, ఎఎన్ఎం సరోజలను హెచ్చరించారు. గ్రామాల్లో కాలువలు శుభ్రం చేయడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించి పరిశుభ్రంగా ఉంచాలని ఇఒపిఆర్డి ప్రభావతిని



ఆదేశించారు. గ్రామంలో పీర్ల పండగ ఉందని, మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని ఇబ్బందిగా ఉందని గ్రామస్తులు వాపోయారు. గత 30 ఏళ్లుగా అదే నీటిని తాగుతున్నామని ఎప్పుడూ ఇలా జరగలేదని గ్రామస్తులు సిఇఓకు వివరించారు. నాలుగు వాటర్ ట్యాంక్‌లను ఏర్పాటు చేసి మంచినీటి సరఫరాను రోజుకు 24 ట్రిప్పులు తిరిగే విధంగా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ వేద స్వరూప తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సిఇఓ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మునెప్ప, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేష్, విఆర్‌ఓ ఆనందం, గ్రామ సర్పంచ్ ముక్కరన్న పాల్గొన్నారు

కబడ్డీ అసోసియేషన్ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి- ఆదోని

ఆంధ్రప్రదేశ్ క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డిను ఆంధ్ర ప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి అసోసియేషన్ సమస్యల గురించి విన్నవించినట్లు జిల్లా కార్యదర్శి అమర్ ప్రకాష్ మంగళవారం ఆదోనిలో తెలిపారు ఆంధ్రప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి పద్మజావుబాల, జిల్లా కార్యదర్శి రామచంద్రతో పాటు మంత్రిని కలవగా ఆయన సానుకూలంగా స్పందించి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కార్యదర్శి శ్రీనివాస్, శ్రీకాకుళం ఈస్ట్ గోదావరి వెస్ట్ గోదావరి కార్యదర్శులు, జిల్లా ప్రధాన కార్యదర్శి శుభకర్, ఆర్థిక కార్యదర్శి ఎం సురేష్, పిడి కృష్ణ పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలు విన్నవించిన నాయకులు

రోడ్డు మరమ్మతుల పనులను త్వరతగతిన పూర్తి చేయండి

- పట్టణంలో పబ్లిక్ టాయిలెట్స్ సంఖ్యను పెంచండి

- ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-ఆదోని

రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ఠమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సమావేశ మందిరంలో డివిజన్ స్థాయి రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గత సమీక్షలు జరిగిన రోడ్ సేఫ్టీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల గురించి ఆరా తీశారు. ముఖ్యంగా డివిజన్ పరిధిలో రోడ్లపై ఉన్న గుంతలను యుద్ధ ప్రాతిపదన పూడ్చాలని ఆర్ అండ్ బి అధికారులకు ఆదేశించారు. ఆదోని పట్టణంలో పార్కింగ్ సమస్య ఎక్కువ ఉన్నందు వల్ల వాటిపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని, ముఖ్యంగా నో పార్కింగ్ ఏరియాలో పార్కింగ్ చేయకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోని పట్టణంలో జనసాంద్రత ఉన్న ప్రదేశాల్లో పబ్లిక్ టాయిలెట్స్ సంఖ్యను పెంచాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలలో ఎక్కడైనా కట్టడాలు జరిగితే వాటిని గుర్తించి విచారణ చేసి తొలగించాలని సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని డీఎస్పీ శివ నారాయణ స్వామి, మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, నేషనల్ హైవే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్ రెడ్డి, ఆర్టీవో నాగేంద్ర, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ షీశిర దీప్తి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహ్మద్ రఫిక్, పంచాయతీ రాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాదన్న, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న శివ నారాయణ శర్మ

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఆదోని

ఆదోని మండలం ఇస్వి గ్రామానికి వెళ్లే దారిలో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పి శివ నారాయణ స్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. స్కూటీపై అక్రమంగా తరలిస్తున్న 846 టెట్రా ప్యాకెట్ల 9 బాక్సుల కర్నాటక మద్యంను స్వాధీనం చేసుకొని ఆదోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ నాగరాజు, బోయగేరికి చెందిన బోయశివలను అరెస్టు చేసి వాహనాన్ని సీజ్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. అక్రమంగా మద్యం అమ్మినా, తరలిస్తున్న సమాచారాన్ని 100కు ఫోన్ చేసి తెలపాలని కోరారు. అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. దాడుల్లో సిఐ తేజమూర్తి, ఎస్సై మధుసూదన్, సిబ్బంది పాల్గొన్నారు.





మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ఆలూరు అభివృద్ధికి తోడ్పాడు అందిద్దాం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరు అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న టిడిపి ఇన్చార్జి వీరభద్ర గౌడ్‌తో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో తోడ్పాడు నందించి ఆలూరు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని టిడిపి బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మనెకుర్తి రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆలూరు టిడిపి కార్యాలయంలో పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలో 20 రోజుల ముందు సీటు కేటాయించడంతో నియోజకవర్గంలోని 6 మండలాల్లో నాయకులను, కార్యకర్తలను కలవడం ప్రచారం చేయడంలో ఒక్కడే కావడంతో ఇబ్బందులకు గురైనారన్నారు. తండ్రిని, తమ్ముడిని పోగొట్టుకొని టిడిపి, ఆలూరు అభివృద్ధికి కృషి చేశారన్నారు. కొందరు అనవసరంగా నిందలు వేసి ఆరోపణలు చేయడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలతో పాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న వీరభద్ర గౌడ్‌కు అండగా ఉందామని కోరారు. సమావేశంలో మాజీ సర్పంచులు గిడ్డయ్య, వెంకటేష్ నాయకులు బినిగేరి వెంకటేష్, చంద్ర, లింగయ్య, నారాయణ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీపై సమావేశం

ప్రజాశక్తి -దేవనకొండ

2023-24 ఆర్థిక సంవత్సరం గాను జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలో జరిగిన పనులపై 18వ సామాజిక తనిఖీ కి సంబందించి సామజిక తనిఖీ బృందం, ఉపాధి హామీ పథక సిబ్బందితో మంగళవారం స్థానిక సిఎల్ఆర్సి భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపిడి పక్కిరప్ప మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో సుమారు రూ.12 కోట్ల మేర పనులు జరిగాయని, సామాజిక తనిఖీని త్వరలో నిర్వహిస్తున్నామని, సిబ్బంది గ్రామాల్లోకి పర్యటించే సామాజిక బృందానికి సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్ఆర్‌పి ఆవులయ్య, ఏపీవో కృష్ణమూర్తి, ఉపాధి పథకం ఇంజనీర్ రంగస్వామి, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విభేదాలు వీడి అభివృద్ధిలో పోటీ పడదాం : టిడిపి

ప్రజాశక్తి - చిప్పగిరి

నియోజకవర్గంలో టిడిపి పార్టీలో అనుభవం గల నాయకులు ఎందరో ఉన్నారని, వారందరూ కూడా గ్రూపు విభేదాలు మానుకొని మండలాలు అభివృద్ధి పతంలో నడవడానికి పోటీ పడదామని జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, మండల కన్వీనర్ లాయర్ షేక్షావలి, పాముల సన్నప్ప, గుమ్మనూరు అంపయ్య అన్నారు. మంగళవారం చిప్పగిరిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వీరభద్ర గౌడ్ మీద లేనిపోని అపోహాలు సృష్టించవద్దని, అది ఏదైనా అధిష్టానం చూసుకుంటుందన్నారు. ఆయన గత టిడిపి పరిపాలనలో నియోజకవర్గానికి 5 ఏళ్లు ఇన్చార్జిగా ఉన్న సమయంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను చేపట్టారన్నారు. పలువురు నాయకులు మమ్ములను కలుపుకుపోవడం లేదని అనడం భావ్యం కాదన్నారు. అనుభవం ఉంది గనుక వీరభద్ర గౌడ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు సీటు ఇచ్చారన్నారు. స్వల్ప ఓట్లతో పరాభవం పొందామని, అది ప్రతి ఒక్క టీడీపీ



మాట్లాడుతున్న మాజీ జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మేకల రవి యాదవ్

కార్యకర్తకు తెలుసు అన్నారు. ప్రతి చిన్న విషయమును పెద్దగా చేసుకుని నష్టపోవడం మంచిది కాదన్నారు. సమావేశంలో సర్పంచ్ నీలకంఠ, బెల్డోన గోవిందు, కోనంకి మహేష్, శ్రీనివాసులు, పోతురాజు రాముడు, కరి గోవిందు, సోమశేఖర్ నాయుడు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశామని టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు, కురువ సంఘం అధ్యక్షుడు మానవి దేవేంద్రప్ప తెలిపారు. మంగళవారం మంగళగిరిలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసి రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. చాలా కాలంగా టిడిపిలోనే కొనసాగుతున్నానని అధినేత ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి అయిన పార్థసారధిని ఎమ్మెల్యేగా గెలిపించామని తెలిపామన్నారు. తాను అందించిన సేవలకు గుర్తింపుగా కురువ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇవ్వాలని కోరామన్నారు. లోకేష్ సానుకూలంగా స్పందించారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.



శ్రమదానంతో కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్ నగరంలోని 19వ వార్డు సోమిశెట్టి నగర్ దగ్గర ఉన్న పబ్లిక్ కొళాయి దగ్గర దట్టంగా పెరిగిన కంప చెట్లను సిపిఎం వార్డు కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం శ్రమదానం చేసి తొలగించారు. సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ నరసింహులు, సిపిఎం వార్డు కార్యదర్శి బి.రాధాకృష్ణలు మాట్లాడుతూ పేదల కోసం వేసిన పబ్లిక్ కొళాయి చుట్టూ కంప చెట్లు పెరిగి దట్టంగా ఉండటం వల్ల తాగునీరు పట్టుకోవడానికి వచ్చే ప్రజలకు చాలా ఇబ్బందికరంగా ఉన్నా కూడా మున్సిపల్ అధికారులు ఈ కంపచెట్లను తొలగించాలని ఆలోచించకపోవడం చాలా అన్యాయం అన్నారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా వారు కంపచెట్లు తొలగించలేదని సిపిఎం నాయకులకు తెలియ చేయడం వల్ల సిపిఎం పార్టీ వార్డు కమిటీ ఆధ్వర్యంలో కొళాయి చుట్టూ ఉన్న కంప చెట్లను శ్రమదానం ద్వారా తొలగించామఅన్నారు. వార్డులో చాలా సమస్యలు



శ్రమదానం చేస్తున్న నాయకులు

విలయతాండవం చేస్తున్నా నగర మేయర్ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. డ్రైనేజీ కాలువలు, రోడ్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉందని చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పరిష్కారం చేయడం లేదన్నారు. వార్డులో ఎక్కడ చూసినా కంప చెట్లు చెత్త చెట్లు దట్టంగా పెరిగి పాములకు, పందులకు నిలయాలుగా మారాయన్నారు. వార్డులో కంప చెట్లు తొలగించి పందులు, పాముల నుండి ప్రజలను కాపాడాలని అన్నారు. మున్సిపల్ అధికారులకు కనువిప్పు కలగాలని సిపిఎం ఆధ్వర్యంలో శ్రమదానం చేశామన్నారు. ఇప్పటికైనా మేయర్ వార్డులో తిరిగి ప్రజా సమస్యలు రోడ్లు, డ్రైనేజీ కాలువలు, కంప చెట్లు సమస్యలు పరిష్కరించాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున పోరాటానికి సిపిఎం సిద్ధమవుతుందని వారు హెచ్చరించారు. సిపిఎం వార్డు నాయకులు ఎస్.మాలిక్, సీతమ్మ, జయన్న, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు మాదన్న, మేస్త్రి వెంకటేశ్వర్లు, మధు పాల్గొన్నారు.

మున్సిపల్ టెండర్లు వాయిదా

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపాలిటీకి ప్రధాన వనరు అయిన ఝాన్సీ లక్ష్మీబాయి కూరగాయల మార్కెట్ వేలం వాయిదా వేశామని మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మార్కెట్ వేలం నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు స్థలం ఇబ్బంది ఉందని అది తేల్చే వరకు టెండర్లు వాయిదా వేయాలని వేలంపాట దారులు కోరగా ఈనెల 23కు వాయిదా వేసినట్లు కమిషనర్ ప్రకటించారు.

ఆదాయం పైన మాత్రమే దృష్టి : వ్యవసాయ మార్కెట్ యార్డులో కూరగాయల మార్కెట్ నిర్వహణ కొనసాగడం వల్ల సుంకం వసూళ్లకు ఇబ్బందిగా ఉందని వేలంపాటదారులు తిమ్మప్ప, జయరాం, లక్ష్మీనారాయణ, ముజిబాహమ్మద్ కోరారు. స్థలం నిర్ధారణ చేసిన అనంతరమే వేలంపాట నిర్వహించాలని పట్టుపట్టారు. వేలం పాట ప్రక్రియ పరిశీలించేందుకు వచ్చిన ఎమ్మెల్యే పార్థసారథి మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డితో మాట్లాడి రైతు మార్కెట్ వెనక ఉన్న ప్రభుత్వ స్థలంలో మార్కెట్ నిర్వాణ కొనసాగించాలని అందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. స్థలాన్ని పరిశీలించి తదుపరి టెండర్లు నిర్వాహణకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామచంద్ర రెడ్డి వివరించారు.

బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి : ఆర్‌ఎవిఎఫ్

ప్రజాశక్తి - నందవరం : నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం ముచ్చుమర్రిలో బాలికను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్, డిఎస్‌వై విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణ, ఖాజా, వెంకటేష్ డిమాండ్ చేశారు. నందవరం కెజిబివిలో కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ ఘటన జరిగి పది రోజులైనా కనీసం మృత దేహం లభించకపోవడం ఏంటని వారు ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించి మహిళాహోం మంత్రి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. మల్లికార్జున, కేజీబీవి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

తుంగభద్ర శ్రీ మఠంలో హుండీ చోరి

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రం మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆధీనంలోని తుంగభద్ర గ్రామంలోని రాఘవేంద్రస్వామి మఠంలో హుండీ చోరీకి గురయినట్లు మాధవరం ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. బ్రాంచి కార్యాలయం మేనేజర్ కుర్డి నాగేషాచార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రాఘవేంద్ర స్వామి మఠంలో ఉన్న హుండీని పగలగొట్టి అందులో ఉన్న సుమారు రూ.30,000 దొంగలించారని చెప్పారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.